క్లుప్తంగా

విజయదశమిని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి

• మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ఆత్మకూరురూరల్: విజయదశమి పర్వదినాన్ని ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలు భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ విజయదశమి పండగ అందరి జీవితాల్లో విజయాలు సమకూర్చాలని, దుర్గాదేవి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.

అమ్మవారి అనుగ్రహం అందరిపై ఉండాలి

• మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



ఉదయగిరి: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయగిరి నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. అందరి జీవితాల్లో వెలుగులు సమకూరాలని, చేపట్టిన ప్రతి కార్యక్రమం విజయం సాధించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ అమ్మవారి అనుగ్రహం ఉండాలని, దుర్గామాత కరుణ కటాక్షాలతో అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని అభిలషించారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో ఉన్న పోలేరమ్మ తల్లి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెదకాపు మెట్టుకూరు పద్మారెడ్డి ఆధ్వర్యంలో మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పిస్తారని పేర్కొన్నారు.

చేజర్ల ఎంపీడీఓగా అలీషాబాబు



బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ

సోమశిల(చేజర్ల): చేజర్ల మండల నూతన ఎంపీడీఓగా ఎ.అలీషా బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా బాపట్ల నుంచి చేజర్ల మండలానికి ఆయన నియమితులయ్యారు. ఈ సందర్భంగా అలీషా బాబు మాట్లాడుతూ మండల పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయడానికి కృషి చేస్తానని, ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆయన్ను పలువురు సత్కరించి అభినందనలు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 15వ వార్డుకు చెందిన సుల్తాన్ మొదీన్ అనారోగ్యంతో బుధవారం మరణించారు. ఆయన తల్లి దివ్యాంగురాలు కాగా, సతీమణి మతిస్థిమితం లేకపోవడంతో పాటుగా పేదరికం కారణంగా ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో శ్రీవెంకటేశ్వర ప్రజా వైద్యశాల ఎండీ, డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ వెంటనే స్పందించి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఆ కుటుంబానికి అందజేశారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్ కుమార్, తోడేటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జగన్మాతా.. నమోస్తుతే

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కావలి, ఆత్మకూరు ఉదయగిరి నియోజకవర్గాల్లో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో పదో రోజు బుధవారం అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్మాతా.. నమోస్తుతే అంటూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆత్మకూరురూరల్: కాశీనాయన ఆశ్రమంలో భద్రకాళిగా..



సంగం: మహిషాసుర మర్దినిగా గంగమ్మ



వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్లలో..



దుత్తలూరు: నర్రవాడలోని రేణుకా ఎల్లమ్మ దేవస్థానంలో..



సీతారామపురం: సిద్ధేశ్వరంలో..



ఉదయగిరి శివాలయంలో..



కలిగిరి: తెల్లపాడులో..

జీఎస్టీ తగ్గింపుపై రైతులకు అవగాహన



ఆత్మకూరు పట్టణంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూరురూరల్: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుపై ఆత్మకూరు పట్టణంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. వ్యవసాయ రంగ వస్తువులైన ట్రాక్టర్లు, విడి భాగాలు, హార్వెస్టర్లు, డ్రిప్ స్ప్రింకర్లు, ట్రాక్టర్ పనిముట్లు, బయో పెస్టిసైడ్స్, డ్రోన్లు తదితరాల వినియోగంలో రైతులకు జీఎస్టీ తగ్గింపు వల్ల ఆదాయం పొందుతారన్నారు. ఆత్మకూర తహసీల్దార్ పద్మజాకుమారి, వ్యవసాయాధికారి కిశోర్‌బాబు వ్యవసాయ రంగానికి సంబంధించిన అన్ని వస్తువులపై జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. అనంతరం రైతుల ట్రాక్టర్లతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రైతు నాయకుడు పెంచల చౌదరి, ఉద్యాన శాఖ అధికారి రాజశేఖర్ రెడ్డి, ఎంపీఈఓలు రేణుక, ఖాజా నవాజ్ పాల్గొన్నారు.

• **సంగం:** జీఎస్టీ తగ్గింపుపై మండల వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఏఓ శశిధర్ రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ సోమ్లా నాయక్, నాయకులు పాల్గొని రైతులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ఫలాల ఉపయోగం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ట్రాక్టర్లపై 12 శాతం ఉన్న జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం ఐదు శాతానికి తగ్గించిందన్నారు.

• **వింజమూరు(ఉదయగిరి):** జీఎస్టీ 2.0తో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గుతాయని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. వింజమూరు పట్టణంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పేరుతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీఏ ఎస్.శేషగిరి రావు, ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి, ఏఓ వాసు, పీఏసీఎస్ అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్లు, స్థానిక నేతలు గూడా నరసారెడ్డి, గణపం సుదర్శన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె.రామారావు, ఉద్యానశాఖ అధికారి షాహిల్ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు



శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

ఆత్మకూరురూరల్: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో 14 మంది కబడ్డీ క్రీడాకారులకు ఆత్మకూరు ఎస్సార్‌జే డిగ్రీ కళాశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా క్రీడాకారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆత్మకూరు ఎస్సార్‌జేడీ నుంచి సుధీర్, కార్తీక్, అనీఫ్, దేవదత్త, రోహిత్, నెల్లూరు జెనెక్స్ కళాశాల నుంచి ఏకనాథ్, హర్షవర్ధన్, వీఎస్ఈ కళాశాల నుంచి సంజయ్, కావలి నుంచి హరిబాబు, ఎంఎస్‌ఆర్ కళాశాల నుంచి సతీష్, కేసీడీసీ కళాశాల నుంచి సాకేత్, సాయి కళాశాల నుంచి చిరంజీవి, జవహర్ భారతి కళాశాల నుంచి భానుప్రకాష్, శ్రీచైతన్య కళాశాల నుంచి నవదీప్ శిక్షణ పొందిన వారిలో ఉన్నారు. వీరు ఈనెల 4 నుంచి 7 వరకు కర్నాటకలోని బెల్గావిలో జరిగే సౌతిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని విక్రమ సింహపురి స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వెంకట రాయులు తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన వారికి క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్యాంపు ఇన్‌చార్జి సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు పచ్చా తిరుపతయ్య, భీమతాటి రమణయ్య, ముని తదితరులు పాల్గొన్నారు.

తెడ్డుపాడు, తిమ్మాపురం గ్రామాల్లో రేపట్నుంచి రీసర్వే



మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు

దుత్తలూరు: మండలంలోని తెడ్డుపాడు, తిమ్మాపురం గ్రామాల్లో శుక్రవారం నుంచి భూముల రీసర్వే కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ యనమల నాగరాజు అన్నారు. ఈ మేరకు తెడ్డుపాడు, తిమ్మాపురం బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకుని తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. సర్వేకు వచ్చినప్పుడు తమ భూములకు సంబంధించిన అన్ని రకాల పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రీసర్వే చేయుటకు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్.చెంచమ్మ, సర్పంచ్ బోయపాటి వెంకటరత్నం, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు



ఉదయగిరిలోని బాణసంచా దుకాణాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సైలు

ఉదయగిరి: బాణసంచా తయారీ, దుకాణదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని సీఐ వెంకటరావు అన్నారు. ఆయన బుధవారం ఉదయగిరి, దుత్తలూరు మండలంలోని బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాలను ఫైర్ సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోనసీమ జిల్లాలోని ఓ కిరాణా దుకాణంలో నిలువ ఉంచిన బాణసంచా పేలుడు ఘటనలో అందరూ మృతిచెందారన్నారు. బాణసంచా తయారీదారులు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. దీపావళి పర్వదినం సందర్భంగా ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి బాణసంచా తీసుకొచ్చే నిర్వాహకులు, దుకాణాలు ఏర్పాటు చేసేవారు లైసెన్స్ పొందాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి హరిబాబు, ఎస్సైలు కె.ఇంద్రసేనారెడ్డి, రఘునాథ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా మహాసభల విజయవంతానికి పిలుపు

అనుమసముద్రంపేట: ఈనెల 5వ తేదీన కొడవలూరు మండలం యల్లాయపాళెంలో జరిగే ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘ జిల్లా కార్యదర్శి మంగలి పుల్లయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ఏఎస్‌పేట సీపీఎం కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు ప్రస్తుతం ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వ్యవసాయ కార్మికులకు పనుల్లేక అల్లాడుతున్నారన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు నిషాద్, పెంచలరావు పాల్గొన్నారు.

మాంసం దుకాణాలను ఏర్పాటు చేస్తే చర్యలు

అల్లూరు: గాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు గురువారం అల్లూరు నగర పంచాయతీ పరిధిలో మాంసం దుకాణాలు నిర్వహించరాదని కమిషనర్ ఉమామహేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ మేరకు నోటీసులు జారీ చేశామని, నిబంధనలకు వ్యతిరేకంగా దుకాణాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

5న వైద్యశిబిరం

ఆత్మకూరురూరల్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని షిరిడీ సాయిరామ్ కళాశాలలో ఈనెల 5న వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. షుగర్, బీపీ, గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించిన ప్రత్యేక పరీక్షలతో పాటు తక్కువ ధరలకు మందులు అందజేస్తారన్నారు. డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల నుంచి డాక్టర్ ఎంపీ రమణయ్య, మెడికవర్ హాస్పిటల్ నుంచి గుండె వ్యాధి నిపుణుడు ఎం.బాలకృష్ణ వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తారన్నారు.

మేకపాటి కార్యాలయంలో గాంధీ జయంతి నేడు

ఆత్మకూరురూరల్: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో గురువారం నిర్వహిస్తున్నట్లు కార్యాలయ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

చిలకలమర్రి ఉపాధ్యాయుడి ప్రతిభ



చల్లా చంద్రశేఖర్‌రెడ్డి

సోమశిల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ కర్మయోగిలో భాగంగా ఉద్యోగులకు అందిస్తున్న ఐ గాట్ (ఇంటిగ్రేటెడ్ గవర్నమెంట్ ఆన్‌లైన్ ట్రైనింగ్) కోర్సుల సెప్టెంబర్ నెల ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఇందులో అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి 5001 పాయింట్లతో జాతీయస్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ రావడం ఆనందంగా ఉందన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ఉదయగిరి రూరల్: సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరికీ అప్రమత్తత అవసరమని ఉదయగిరి సీఐ ఎస్.వెంకట్రావు అన్నారు. ఆయన బుధవారం మండలంలోని కుర్రపల్లి బీసీకాలనీ, సీతారామపురం మండలంలోని ఎస్సార్ నగర్ కాలనీ, దుత్తలూరు మండలం సోమలరేగడ ఎస్సీ కాలనీలలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని ఎవరూ ప్రోత్సహించవద్దన్నారు. గ్రామాల్లోని ఆలయాలు, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన దినోత్సవం

ఆత్మకూరురూరల్: పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం రక్తదాన దినోత్సవం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శేషారత్నం ర్యాలీని ప్రారంభించి, మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ చాన్స్, బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ శివకృష్ణ, స్టాఫ్ నర్సు మహేష్, ఊహ, రామయ్య, రహీమ్, రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

• **కావలి (అల్లూరు):** కావలిలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వాక్ ఫర్ బ్లడ్ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. కార్యక్రమంలో కావలి సబ్ డివిజన్ పోలీస్ అధికారి శ్రీధర్, కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్, డాక్టర్లు నళిని, పద్మ, శ్రీధర్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్‌కు తప్పిన ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ఉదయగిరి: ఉదయగిరి పట్టణ సమీపంలోని పెద్దచెరువు వద్ద జాతీయ రహదారిపై బుధవారం రాత్రి కారు గేదెను ఢీకొన్న ఘటనలో డిప్యూటీ కలెక్టర్‌కు పెద్ద ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ రెయరాలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న నాదెళ్ల తిరుపతయ్య తన స్వగ్రామమైన ఉదయగిరి మండలం గడ్డంవారిపల్లికి దసరా పర్వదినం సందర్భంగా వచ్చారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఆత్మకూరులోని ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లే నిమిత్తం భార్యతో కలిసి కారులో బయల్దేరారు. ఈ క్రమంలో పెద్దచెరువు వద్ద రోడ్డుకు అడ్డంగా గేదెలు రావడంతో వాటిని తప్పించబోయినప్పటికీ వీలుకాక ఓ గేదెను ఢీకొట్టారు. కారులోని ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో ఇద్దరికీ ఎలాంటి ప్రమాదం జరగకుండా సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదంలో ఓ గేదె అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను గమ్యస్థానానికి పంపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి ఇబ్బందులకు పరిష్కారం

ఉదయగిరి: ఉదయగిరి ఎస్టీ కాలనీలో గత నెల రోజులుగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న క్రమంలో బుధవారం మండల ఉపాధ్యక్షురాలు శాంతి సొంత నిధులతో ట్యాంకర్ ఏర్పాటు చేయించి నీటి సమస్యను తీర్చారు. దీంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

బైక్ అదుపుతప్పి మహిళకు గాయాలు

మర్రిపాడు: బైక్ అదుపుతప్పి పడిన ఘటనలో ఓ మహిళకు గాయాలైన ఘటన మండలంలోని నందవరం వద్ద నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని చుంచులూరు నుంచి ఆత్మకూరు వైపు వెళ్తున్న బైక్.. లారీని తప్పించే క్రమంలో రహదారి పక్కనే ఉన్న చెట్ల కొమ్మలు తగిలి అదుపుతప్పి పడింది. కాగా గాయపడిన మహిళను టోల్ ప్లాజా అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.